

చికిత్స పొందుతున్న ఏఈ

## పని ఒత్తిడితో ఏఈ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ, మార్చి 7: పని ఒత్తిడి భరించలేక ఓ అసిస్టెంట్ ఇంజినీర్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని పద్మారావునగర్‌కు చెందిన శ్రీకాంత్.. మూడేండ్లుగా బాన్సువాడ డివిజన్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏఈగా పని చేస్తున్నాడు. శ్రీకాంత్‌కు ఇటీవలే ఇద్దరు కవలలు జన్మించగా, రూ.50 లక్షల దాకా ఖర్చయింది. మూడేండ్లుగా కుటుంబానికి దూరంగా ఉండడం, డిప్యుటేషన్‌ను కొనసాగిస్తుండడం, పని ఒత్తిడి పెరగడంతో శ్రీకాంత్ మనస్తాపానికి గురయ్యాడు. గురువారం దేశాయిపేట్‌కు వెళ్లి పురుగులమందు తాగాడు. బాన్సువాడకు వచ్చి పురుగుల మందు తాగిన విషయాన్ని మేనత్త సుశీలతో చెప్పాడు. ఆమె స్థానికుల సాయంతో దవాఖానకు తరలించగా ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. శ్రీకాంత్‌ను ఉన్నతాధికారులు పరామర్శించి, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత డిప్యుటేషన్‌ను మార్చుతామని చెప్పారు.

## 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం**

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభంకానున్నాయి. గవర్నర్ ఆదేశం మేరకు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు శుక్రవారం గెజిట్ విడుదల చేశారు. తొలిరోజు ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశ మందిరంలో శాసనమండలి, శాసనసభ సంయుక్త సమావేశంతో సమావేశాలను ప్రారంభిస్తారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. నిర్దేశిత సమయానికి సభ్యులంతా హాజరుకావాలని అసెంబ్లీ కార్యదర్శి కోరారు.

# జాగృతి బీసీ పోరు.. దిగొచ్చిన సర్కారు

- ఎమ్మెల్సీ కవిత ఒత్తిడితో 42 శాతం బీసీ కోటాకు ఆమోదం
- ఏడాది కాలంగా బీసీ సంఘాలతో విస్తృత సమావేశాలు
- కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ సంఘాలు



బీసీ నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత (ఫైల్)

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): బీసీలకు 42 శాతం కోటా కోసం తెలంగాణ జాగృతి పోరాటం ఫలించింది. పూలే యునైటెడ్ ఫ్రంట్‌తో కలిసి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సాగించిన ఉద్యమంతో సర్కారు దిగొచ్చింది. రాజకీయ, ఉద్యోగ, విద్యారంగాల్లో వేర్వేరుగా రిజర్వేషన్లు కల్పించాలని, లేదంటే చట్టపరమైన చిక్కులు తప్పవని ఏడాది కాలంగా చేస్తున్న డిమాండ్లకు ప్రభుత్వం తలొగ్గింది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది.

**రాష్ట్రవ్యాప్త పర్యటనలు.. సంఘాలతో సమావేశాలు**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత ఏడాది కాలంగా పోరాటం కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. బీసీ సంఘాల నాయకులు, మేధావులతో సమావేశాలు నిర్వహించారు. బలహీనవర్గాల్లో చైతన్యం కల్పించడంలో సఫలీకృతులయ్యారు. బీసీలకు స్థానిక, ఉద్యోగ, విద్యా రంగాల్లో కలిపి 42 శాతం కోటా ఇస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని పదేపదే అనేక వేదికలపై నొక్కిచెప్పారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పన రాష్ట్రపరిధిలో ఉంటుందని, విద్య, ఉద్యోగ రంగాల్లో కేంద్రం ఆమోదం అవసరమని బలంగా చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో మూడింటికి కలిపి రిజర్వేషన్లు కల్పిస్తే మొదటికే మోసపోవాల్సి వస్తుందని నిరంతరం హెచ్చరించారు. ఇందిరాపార్క్ వేదికగా జరిగిన మహాధర్నాలోనూ బలంగా తన వాణిని వినిపించారు. గత ఫిబ్రవరి నాలుగున శాసనమండలి సమావేశంలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. నాలుగురోజుల క్రితం పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం వేర్వేరు బిల్లులు తీసుకురావాలని నిర్ణయించింది. కాగా, బీసీ ప్రత్యేక కోటా కోసం కవిత సాగించిన పోరాటంపై బీసీ సంఘాల నాయకులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

**బీసీలకు రిజర్వేషన్ల కోటా పెంపుకోసం తెలంగాణ జాగృతి ఉద్యమ ప్రస్థానం..**

- 21 జనవరి 2024: అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పణ.
- 26 జనవరి 2024: హైదరాబాద్‌లో బీసీ సంఘాలతో రౌండ్‌టేబుల్ మీటింగ్
- 05 ఫిబ్రవరి 2024: యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆవిర్భావం
- 06 ఫిబ్రవరి 2024: జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో కరీంనగర్, వరంగల్‌లో రౌండ్ టేబుల్ సమావేశాలు
- 07 ఫిబ్రవరి 2024: వికారాబాద్‌లో రౌంట్‌టేబుల్ మీటింగ్
- 11 ఫిబ్రవరి 2024: యునైటెట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం
- 11 మార్చి 2024: నల్లగొండలో రౌండ్ టేబుల్ మీటింగ్
- 11 ఏప్రిల్ 2024: సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో కులగణన, బీసీ రిజర్వేషన్లు, కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై విస్తృతస్థాయి సమావేశం
- 25 నవంబర్ 2024: ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్‌కు జాగృతి ఆధ్వర్యంలో సమగ్ర నివేదిక సమర్పణ.
- 2 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో పద్మశాలీ కుల సంఘం నేతలతో సమావేశం
- 06 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో జోగి కుల సంఘం నేతలతో సమావేశం
- 07 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో మేదరి కుల సంఘం నేతలతో సమావేశం
- 11 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో వడ్డెర కుల సంఘం నేతలతో సమావేశం
- 12 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో వంశరాజ్, సగర, ఉప్పర, రజక సంఘాల నేతలతో సమావేశం
- 12 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో బీసీ కులసంఘాల నేతలతో విస్తృతస్థాయి సమావేశం
- 24 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లోవిశ్వకర్మ, ముదిరాజ్ కులస్తులతో మీటింగ్
- 26 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో శాలివాహన, ఆరెకటిక కులస్తులతో మీటింగ్
- 26 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో బీసీ కుల సంఘాలతో ఉద్యమ కార్యాచరణపై సమావేశం, చర్చలు
- 27 డిసెంబర్ 2024: హైదరాబాద్‌లో ఉమ్మడి నిజామాబాద్ బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో పూసల, ముదిరాజ్, పద్మశాలీ, మొండిబండ, రజక, నాయీబ్రాహ్మణ, కురుమ, యాదవ, గౌడ్, దాసరి, జంగమ, నకాశి, రెడ్డిక, వీరశైవ, మున్నూరుకాపు, పెరుక, మేరి సంఘం నాయకులతో సమావేశం.
- 03 జనవరి 2025: స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ కోటా సాధనకోసం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా.
- 23 జనవరి 2025: కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ.
- 15 ఫిబ్రవరి 2025: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఖమ్మంలో బీసీ సంఘం నేతల రౌండ్‌టేబుల్ సమావేశం.
- 28 ఫిబ్రవరి 2025: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో బీసీ సంఘం నేతల రౌండ్‌టేబుల్ సమావేశం

# మొండిచేయి చూపి.. తొండి ప్రకటనలు !

- మహిళా దినోత్సవం సందర్భంగా 15 అంశాలతో ప్రకటన
- హామీలను అమలుగా చూపుతున్న కాంగ్రెస్ సర్కారు
- ఏడాదిలో సాధించిన విజయాలుగా సొంతడప్పు
- హామీలు, ప్రకటనలు ఉత్త ముచ్చట్లేనని మహిళల విమర్శలు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల వేళ మహాలక్ష్మి స్కీమ్ పేరుతో మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారంటూ మహిళలు ఊరూరా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎవరిని కదిలించినా కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో విరుచుకుపడుతున్నారు. ఓ వైపు పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వం మాత్రం మహిళా దినోత్సవం సందర్భంగా 15 అంశాలతో చేసిన ప్రకటన మరిన్ని విమర్శలకు తావిస్తున్నది. చెప్పిందే చేయని సర్కారు.. చేయనివీ చేశామని చెప్పుకోవడం విడ్డూరమని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. సర్కారు చేసిన ప్రకటనలో తప్పులను ఎండగడుతూ ఇవిగో వాస్తవాలు అంటూ సంఘాల ప్రతినిధులు నిలదీస్తున్నారు.

**హామీలు ఏమాయె రేవంత్‌రెడ్డి?**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా మరిచిపోయారని మహిళా సంఘాల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మహిళలకు ఇచ్చిన హామీలకు ఎగనామం పెట్టారని మండిపడుతున్నారు. ఏడాది పాలనలో ఏమీ చేయకుండా అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా హామీలు, మాయమాటలు, అబద్ధాలను విజయాలుగా చాటింపు చేసుకోవడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు. ప్రకటించిన పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు చిత్తశుద్ధి చూపాలని మెప్మా రిసోర్స్ పర్సన్ సునీత డిమాండ్ చేశారు.

### ఏది నిజం? ఏది భజన?

| ప్రకటనలో ఏముంది? | మహిళా సంఘాలు ఏమంటున్నాయి? |
|---|---|
| రూ.21,632 కోట్ల రుణాలు ఇచ్చాం | ప్రభుత్వం ఇవ్వలేదు, బ్యాంకు రుణాలు |
| 2,25,110 సూక్ష్మ,మధ్య తరహా సంస్థల ఏర్పాటు | ప్రకటనకే పరిమితం |
| రూ.110 కోట్లతో మహిళా శక్తి భవనాలు | ఎక్కడ నిర్మిస్తున్నారో చెప్పాలి |
| 214 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు | 10 క్యాంటీన్లు కూడా నిర్మించలేదు |
| స్కూల్ యూనిఫామ్‌లు కుట్టే పనితో రూ.30 కోట్లు లబ్ధి | రూ.10 కోట్లు కూడా కేటాయించలేదు |
| అమ్మ ఆదర్శ పాఠశాలల్లో రూ.634 కోట్లతో పనులు | సగం నిధులు కూడా ఇవ్వలేదు |
| రాయితీపై 32 జిల్లాల్లో 32 మొబైల్ ఫిష్ రిటైల్ ట్రక్కులు | ఎవరికిచ్చారో సమాచారమే లేదు |
| 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు | హామీకే పరిమితం |
| 32 జిల్లాలలో మహిళా సమాఖ్యలకు పెట్రోలు బంకులు | ఒక్కటి మాత్రమే నిర్మాణంలో ఉంది |
| మహిళా సంఘాలకు 600 ఆర్టీసీ అద్దె బస్సులు | హామీకి పరిమితం |

## వీరనారి ఐలమ్మ మనుమడు మృతి

**సంతాపం తెలిపిన ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి ఎర్రబెల్లి**



రాంచంద్రం(ఫైల్)

పాలకుర్తి, మార్చి 7: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, చాకలి (చిట్యాల) ఐలమ్మ మనుమడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రాంచంద్రం(76) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. రాంచంద్రం 1953లో ఐలమ్మ పెద్ద కుమారుడు చిట్యాల కట్టెల సోమయ్యకు మూడో సంతానంగా జన్మించాడు. 1981లో పాలకుర్తి సర్పంచ్‌గా సీపీఎం నుంచి పోటీ చేసి అప్పటి సర్పంచ్ వీరమనేని కిషన్‌రావును ఓడించి చరిత్ర సృష్టించాడు. పాలకుర్తిలో 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డును వేసి రికార్డు సాధించాడు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశాడు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రాంచంద్రం భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్, ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోల్ ఆనందభాస్కర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున అదనపు కలెక్టర్ ఫర్మర్ పింకేశ్‌కుమార్, ఆర్డీవో డీఎస్ వెంకన్న రాంచంద్రం మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాంచంద్రం కుటుంబసభ్యులను జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫోన్‌లో పరామర్శించారు. రాంచంద్రం ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. త్వరలో రాంచంద్రం కుటుంబ సభ్యులను కలుస్తానని చెప్పారు.

## 6,7 తరగతులకు ఇంకా నిక్కర్లే..!

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : నిక్కర్లు వద్దంటూ విద్యార్థులు మొత్తుకుంటున్నా.. విద్యార్థులు తీసుకోవడం లేదని హెచ్‌ఎంలు మొత్తుకుంటున్నా వచ్చే విద్యాసంవత్సరంలో సైతం 6,7 తరగతుల్లోని వారికి విద్యాశాఖ నిక్కర్లే ఇవ్వనున్నది. పాత యూనిఫారాల డిజైన్‌ను సైతం మార్చారు. వస్త్రం తక్కువయ్యేలా వీటి డిజైన్ రూపొందించారు. గతంలో ఆకట్టుకునేలా, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు ధరిస్తున్నట్టుగా యూనిఫారాలు ఇవ్వడంలో భాగంగా విభిన్న డిజైన్లతో యూనిఫారాలను అందించారు. కానీ వచ్చే ఏడాదిలో డబ్బులు మిగిల్చుకునేందుకు విద్యాశాఖ వస్త్రం తక్కువయ్యేలా డిజైన్లను మార్చింది.



సిద్దిపేటలోని టీజీఎస్‌పీడీసీఎల్ కంపెనీలో మరమ్మతుకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు



నల్లగొండ జిల్లా పాలెంలో లో వోల్టేజ్ వల్ల పాడైన ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాక్టర్లలో మరమ్మతుకు తీసుకొస్తున్న రైతులు

# కర్షకులకు మళ్లీ కాళ రాత్రులు!

**కాంగ్రెస్ పాలన.. కష్టాలకు చిరునామా..**

**కరెంటు కోసం రాత్రివేళ రైతుల పడిగాపులు**

- అర్ధరాత్రి పూట బావుల వద్దకు పరుగులు
- పదేండ్ల తర్వాత మళ్లీ పీడిస్తున్న పాత కష్టాలు
- కడుపుమండి రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- కలెక్టరేట్లు, కరెంటు ఆఫీసుల వద్ద ధర్నాలు
- విద్యుత్తు సంక్షోభంతో అప్రకటిత కోతలు
- మార్చిలోనే ఇట్ల.. ఎండలు ముదిరితే ఎట్ల?

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : కర్షకులకు మళ్లీ కాళరాత్రులు వచ్చాయి. 24 గంటల నిరంతర కరెంటుతో పదేండ్ల పాటు గుండెలపై చెయ్యేసుకొని కంటి నిండా నిద్రపోయిన రైతులకు ఇప్పుడు కునుకు కరువైంది. రాష్ట్రంలో సమైక్య పాలన నాటి విద్యుత్తు కష్టాలు పునరావృతమవుతున్నాయి. పొలానికి నీళ్లు పెట్టేందుకు కరెంటు కోసం అర్ధరాత్రి పడిగాపులు మొదలయ్యాయి. 14 నెలల్లోనే విద్యుత్తు రంగం అస్తవ్యస్తం కావడంతో అటు అన్నదాతలు, ఇటు ప్రజలకు 'అప్రకటిత కోతల' కష్టాలు ఎదురవుతున్నాయి. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటి, మరోవైపు చాలీచాలని కరెంటుతో పంటలకు నీళ్లందక ఎండిపోతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో కడుపుమండిన రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. సాగుకు సరిపడా కరెంట్ ఇవ్వని సర్కారుపై నిత్యం ఏదో ఒక చోట నిరసన గళం వినిపిస్తూనే ఉన్నారు.

**అర్ధరాత్రి బావుల వద్దకు..**

గ్రామాల్లో రాత్రి 12 గంటలకు త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్నారు. ఉదయం 7 గంటలకే ఎండ మండిపోయి పొలాల్లో నీళ్లు ఎండిపోతున్నాయి. రాత్రిపూట నీళ్లు పారిస్తేనే పొలాల్లో జీవం ఉంటున్నది. ఇలా రాత్రిపూట ఇచ్చే కరెంట్ కోసం ఇప్పుడు అర్ధరాత్రి, అపరాత్రి రైతులు బావుల వద్దకు పరుగులు పెడుతూ పడిగాపులు కాస్తున్నారు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందే తెలియని కరెంట్ కోసం బావుల వద్దే నిద్రకుండా నిరీక్షిస్తున్నారు. ఇది వరకు రైతు ఉదయం 5 గంటలకు పొలానికి వెళ్లి నీళ్లు పారించే పరిస్థితి ఉండగా ఇప్పుడు అర్ధరాత్రి అరిగోస పడుతున్నారు. టార్చిలైట్లు చేతబట్టి చిమ్మచీకట్లల్లో పంటలను కాపాడుకునేందుకు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. పాములు, తేళ్లు, విష పురుగులతో మళ్లీ సావాసం చేస్తున్నారు.

**అప్రకటిత కోతలు షురూ**

విద్యుత్తు రంగ నిర్వహణ అస్తవ్యస్తం కావడంతో రాష్ట్రంలో సంక్షోభానికి దారి తీసి ఎండలు ముదరకముందే అప్రకటిత కోతలు షురువయ్యాయి. దీంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోవోల్టేజీ సమస్యలు, మోటర్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం వంటివి పునరావృతమవుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో వెలుగులు విరజిమ్మిన తెలంగాణలో కాంగ్రెస్ రాగానే కారుచీకట్లు కమ్ముకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు పోయినా, ఫ్యూజు పోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. విద్యుత్తు సరఫరా వ్యవస్థల మీద అవగాహన లేకుండా ఆపరేషన్ సిబ్బంది బదిలీలు చేపట్టారు. పంపిణీలో అత్యంత కీలకమైన టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 73 ఆపరేషన్ ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ఇంజినీర్లను బదిలీ చేసి పట్టణ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో రైతులే మరమ్మతులు చేసుకోవాల్సి వస్తున్నది. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటి, మరోవైపు చాలీచాలని కరెంట్‌తో ఉన్న నీళ్లూ పారక రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయి. సాగుకు సరిపడా కరెంట్ ఇవ్వాలని విన్నవించినా పట్టించుకునేవారే లేక రైతుల ఆందోళనలు నిత్యకృత్యమయ్యాయి.

**సమ్మర్ ప్లాన్ ఫెయిల్!**

నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి జలాశయాల్లో నీళ్లు లేవు. జల విద్యుత్తు ఉత్పత్తి చేసే పరిస్థితులు కనిపించడంలేదు. ఉమ్మడి జిల్లాల వారీగా తీసుకుంటే కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్నది. ఈ జిల్లాల్లో వ్యవసాయం కాలువల కంటే ఎక్కువగా బోర్లు, బావుల మీదే ఆధారపడి నడుస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో నాట్లు ఆలస్యమయ్యాయి. మే నెల వరకు పంటలకు నీళ్లందించాల్సి ఉన్నది. రాష్ట్రంలో పెరిగిన డిమాండ్‌కు తగినంతగా విద్యుత్తు అందుబాటులో లేదు. గరిష్ఠ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతున్నది. ఫిబ్రవరి 10న 15998 మెగావాట్లు, 19న 16058 మెగావాట్లుగా నమోదైంది. మార్చిలో 17,500 మెగావాట్లకు చేరనున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. మన రాష్ట్రంలో విద్యుత్తు సరిపడా లేనందున రోజుకు దాదాపు రూ.10 కోట్లు వెచ్చించి పక్కరాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఉమ్మడి జిల్లాల వారీగా తీసుకుంటే కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోనే డిమాండ్ పెరుగుతున్నది. ఆ జిల్లాల్లో వ్యవసాయం కాలువల పారకం కంటే ఎక్కువగా బోర్లు, బావుల మీదే అధారపడి నడుస్తున్నది. పరిస్థితులను ముందుగా అంచనా వేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్లే సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని విద్యుత్తురంగ నిపుణులు మండిపడుతున్నారు. మార్చి 10లోగా పూర్తి చేయాలని కాగితాలపై గడువు పెట్టుకున్నప్పటికీ ఏవీ కూడా కొలిక్కిరాలేదని చెప్తున్నారు. ఫలితంగా సబ్ స్టేషన్లపై ఓవర్‌లోడ్ పడుతున్నదని పరిస్థితి తీవ్రతను వివరిస్తున్నారు.

### పవర్ ఓవర్‌లోడ్ - పనులు స్లో మోడ్

| | |
|---|---|
| రాష్ట్రంలో మొత్తం ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు | 378 |
| ఓవర్‌లోడ్ పడుతున్న సబ్‌స్టేషన్లు | 56 |
| సమ్మర్ ప్లాన్‌లో తలపెట్టిన సబ్ స్టేషన్లు | 98(33/11 కేవీ) |
| ప్లాన్‌లో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోనివి | 65 |
| ప్రణాళికలో టీజీఎన్పీడీసీఎల్ పరిధిలోనివి | 33 |
| మార్చాల్సిన 33 కేవీ ఫీడర్లు | 218 |
| మార్చిన ఫీడర్లు | 93 |
| మార్చాల్సిన 11కేవీ ఫీడర్లు | 1,183 |
| మార్చిన ఫీడర్లు | 681 |
| రాష్ట్రంలో మొత్తం డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు | 23,648 |
| డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగింపు పూర్తయినవి | 19,000 |
| పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు కోసం మంజూరు | 399 |
| బిగించిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య | 214 |



కరీంనగర్‌లోని కమాన్ వద్ద మోటార్లను రిపేరు చేస్తున్న మెకానిక్

### గరిష్ఠ డిమాండ్ ఎప్పుడు, ఎంత?

| తేదీ | పీక్ డిమాండ్ (మెగావాట్లల్లో) | కొనుగోలు విద్యుత్తు (మిలియన్ యూనిట్లు) |
|---|---|---|
| 5-3-2025 | 16,554 | 175.278 |
| 4-3-2025 | 16,687 | 183.207 |
| 3-3-2025 | 16,311 | 176.077 |
| 2-3-2025 | 15,985 | 175.824 |
| 1-3-2025 | 16,252 | 179.299 |
| 28-2-2025 | 16,392 | 176.062 |
| 27-2-2025 | 16,030 | 172.123 |

## తరచూ కోతలు..

కరెంట్ కోతల కారణంగా అటు రైతులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు నిత్యం ఏదో ఒక చోట నిరసనలకు దిగుతున్నారు. ఎండిన వరి, మక్కను చూపుతూ కలెక్టరేట్లు, విద్యుత్తు కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు.



- జనవరి 18న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని భోగారంలో వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు నిలిపివేశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటం, ఆయా బిల్లులు కట్టకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్తు నిలిపివేసినట్లు డీఈ ప్రకటించారు.
- దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని భోగారంలో ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్తు నిలిపివేశారు. దీంతో వ్యవసాయ పొలాలకు సాగునీటినందించే మోటార్లు మూలనపడ్డాయి.
- ఫిబ్రవరి మొదటి వారంలో సైబరాబాద్‌లో 4 గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.
- ఫిబ్రవరి రెండో వారంలో ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలో గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మెయింటెనెన్స్ వర్క్స్ వల్లేనని అధికారులు చెప్పారు.
- ఫిబ్రవరి 14న శేరిలింగంపల్లిలోని సుదర్శన్‌నగర్‌లో 11: 30 గంటలకు పోయిన కరెంట్ 4 గంటలైనా రాలేదు.
- ఫిబ్రవరి 28న మెదక్ జిల్లా చేగుంట మండలం కర్ణంపల్లి సబ్‌స్టేషన్ ముందు వందలాది మంది రైతులు ఆందోళనకు దిగారు. విద్యుత్తు సక్రమంగా రాకపోవడం, పంటలు పండే పరిస్థితి లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు సబ్‌స్టేషన్ ముందు నిరసన తెలిపారు.
- మార్చి 5న వరంగల్ నగరంలోని 3వ డివిజన్ కొత్తపేటలో గత ఐదు రోజులుగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు రోడ్డుపై ధర్నా, ఆందోళన నిర్వహించారు. లోడ్ అధికమై ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నట్లు డీఈ తెలుపడం విశేషం.
- మార్చి 6న అల్వాల్ – వెంకటాపురం ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ కట్ అయ్యింది. ఉక్కపోతలతో జనం అల్లాడిపోయారు.
- మెదక్ జిల్లాలో నెలకు సగటున 500 -600 వ్యవసాయ మోటర్లు కాలిపోతున్నాయి. ఇప్పటికే వరినాట్లు, పంట పెట్టుబడి కోసం అప్పులు చేసిన రైతులకు మెటర్లు కాలిపోవడంతో మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారు.
- సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయానికి 8– 16 గంటలే కరెంట్ ఇస్తున్నారు. ఈ జిల్లాలో బోరుబావులకు సంబంధించి కొన్ని మండలాల్లో లోవోల్టేజీ సమస్య ప్రారంభమైంది. భూగర్భ జలాలు తగ్గిపోవటం వల్ల బోరు మోటర్లు నిరంతరంగా నడుస్తుండటంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫీజులు పోతున్నాయి.



జనగామ జిల్లా వడ్లకొండలో నాలుగు ఎకరాల్లో ఎండిపోగా మిగిలిన ఎకరం పొలాన్ని కాపాడుకోడానికి రోజుకు రూ. వెయ్యి పెట్టుబడితో జనరేటర్ అమర్చి పొలానికి నీరు అందిస్తున్న రైతు కాసర్ల అశోక్